# వింత వివాహం

"ఉషా..ఉషా..అబ్బ-ఎక్కడికెళ్ళావే"? అంది మహాలక్ష్మి.

"ఇదిగో అమ్మా వస్తున్నాను ఎందుకలా గొంతు చించుకొంటావ్?"

"ఏం లేదమ్మా ఇవాళ నాలుగ్గంట్లకి ఇంట్లోనే వుంటావు కదూ?"

"ఇవాళా. కాలేజీలో మీటింగు వుందే, వెళ్ళాలి"

"ఎప్పుడూ మీటింగు, ఛీటింగు అని కూచుంటే ఎలాగ? ఇవాళ నిన్ను చూడ్డానికని పెళ్ళివారు వొస్తున్నారే. అందుకని ఇంట్లోనే వుండమ్మా"

"అబ్బ పోవేఅమ్మా నీకెప్పుడూ పెళ్ళి గొడవే"

"మా తల్లికదూ. ఈ పూటకి వుండిపోమ్మా"

"సరేలే"

ఉష వెంకటేశంగారి కూతురు. ఒక్కతే ఆడపిల్ల గనుక అల్లారుముద్దుగా పెరిగింది ఇంటర్ చదువుకొంటోంది కొంచెం టిప్‌టాపుగా వుంటుంది రాముం ఉష అన్నయ్య

నాలుగ్గంటలయ్యే సరికల్లా ఉష చక్కగా ముస్తాబయింది ఇంతలోకి పెళ్ళివారు, ఉష నాన్నగారు, అన్నయ్య అందరూ వస్తున్నారు.

"అమ్మా-అమ్మా వాళ్ళంతా వస్తున్నారే"

"రానీమ్మా అలా తొందర పడతా వెందుకూ?"

"రండి, కూర్చోండి" అంటూ పెళ్ళివారికి మర్యాద చేసింది మహాలక్ష్మి

పెళ్ళికొడుకు పేరు భాస్కర్ ఇతను కుటుంబరావుగారి ఏకైక పుత్రుడు. బి ఎల్ చదువుకొంటున్నాడు. ఈతని బామ్మకి మడి, ఆచారం చాలా ఎక్కువ

**ఇందిర**

"అమ్మా నీ పేరేమిటే తల్లీ కొంచెం గట్టిగా చెప్పమ్మా ముసిలి దాన్ని కదూ? బాగా వినిపించదు" అంది బామ్మగారు

"ఉష! అండి బామ్మగారు"

"ఏవిటీ-ఉషా! ఉష, విషమా? ఇదేం పేర్లమ్మా చక్కగా ఏసీతాలక్ష్మనో, మహాలక్ష్మనో పెట్టుకోక పోనీలే ఏం చదువుకొంటున్నావమ్మా?"

"ఇంటర్ చదువుకుంటున్నానండి"

"ఏవిటీ ఇట్టరూను, చిట్టరూను ఇందేం చదువులమ్మా, ఆడపిల్లలు కూడా మొగపిల్లల చదువేలా చదువుతున్నారేవిటమ్మా? సరే కానీ, నీకేవన్నా పాటలొచ్చా ఉషా? వస్తే ఒక్కటి పాడమ్మా"

"మా అమ్మాయికి సంగీతం చెప్పించలేదండి ఏదో కొన్ని పాటలు మటుకు పాడుతుంది. ఉషా ఏదైనా వొకటి పాడమ్మా"

"మనసులోని మనసా..." అంటూ పాడింది ఉష.

"ఇదేం సోగ్యవే కోడలా, చక్కగా ఏగాయత్రి మీదో, సావిత్రీదేవి మీదో పాడక ఏవిటో మనసులోని మనసాట! బాగానే వుంది!"

"అత్తయ్యా మీరలా అంటోంటే అమ్మాయి గాభరాపడి పోతుంది"

"వూరుకోవే చాలు నేటి కాలానికి అత్తగారిని ఆజ్ఞ పెట్టడానికి తయారయ్యావు ఆయన పోయాకే ఈకొడుకూ కోడలూను నన్ను చంపుకు తింటున్నారు. ఈ సోద్యవేవిటమ్మా... ఆ రెండు జళ్ళేవిటే? ఎలక తోకల్లాగా? చక్కగా వాలు జడేసుకో కూడదూ? ఆపక్క పాపిడేవిటే? పైగా పక్క పిన్నీసులు కూడా పెట్టింది చాలా వింతగావుందే! చేతినిండా గాజులేసుకోక ఆ చేతికి ఆనల్లపట్టి ఏమిటే, ఒహో, రిస్టువాచీ గాబోలు, బాగానేవుంది. కనీ కనిపించని ఆ సన్నని బొట్టేవిటి? ఇలాంటి కోడల్ని తెస్తే, ఒరే అబ్బాయి, నే చెపుతున్నాను చూడు, మనకొంప మునిగిందన్నమాటే"

నీ అధికారం ఎక్కువై పోతోంది ఆ అమ్మాయిని అలా

వేపుడు తింటావెందుకూ?" అన్నాడు పెళ్ళికొడుకు

"చాల్లేరా నన్ననడానికి నువ్వెవ్వడివిరా? నిన్నగాక మొన్న పుట్టేవు నన్నే దబాయిస్తున్నావే ఏదో పెద్దదాన్ని గదా, మనవడికి మంచి సంబంధం చేసుకొందామని నే నెంతో ఆశపడుతోంటే, నాకే వచ్చాయి చివాట్లు, బాగానేవుంది నాయనా.. పెళ్ళిగాకముందే పెళ్ళాన్ని వెనకేసుకొస్తున్నావే? ఒసే ఉషా - నీకు వంట చేయడం వచ్చా?"

"వచ్చండి బామ్మగారు అన్నం, చారు, వేపుడు కూరలవీ చేస్తానండి"

"పచ్చిపులుసు చేయడం వచ్చునే?"

"రాదండి"

"రాదంటే ఏమన్న మాటే? అంత తేలికయిందే రాకపోతే ఎలాగ? ఏమండీ? మీ అమ్మాయికి వంట గింట ఏవీ నేర్పలేదేవిటి?"

"అమ్మాయి కాలేజీ నుంచి ఇంటి కొచ్చేసరికే అలసి పోతుందండీ అంచేత వంట అంత బాగా అలవాటు లేదు"

"అబ్బ ఎంత సుకుమారివే! అలసిపోతుందిట అలసిపోతుంది. ఏం, మేమంతా ఈవయస్సులో గుండిగెడు అన్నం చేయమంటే, చేసి చక్కా వుంచేవాళ్ళం. ఇలా వుంటే ఇంక బాగానే వుంటుంది"

"అమ్మా, నీ అధిక ప్రసంగం చాలించింక ఇంటి కెడదాంలే ఇంకెప్పుడూ కూడా మే మెక్కడి కెళ్ళినా నిన్ను తీసుకెళ్ళం బాబు"

"చాలా బాగుంది నాయనా. కని, పెంచి పెద్దవాణ్ణి చేసినందుకు చాలామంచి బహుమతిఇస్తున్నావు. ఇంతకీ నాఖర్మం ఆయనే పోయే బదులు నేనే చచ్చిపోతే బాగుండేది నేనొక పాపిని. ఏదో ఇది ముసిలిదిగదా దీనిఏడుపు ఇది ఏడవని అని అన్నవాళ్ళు వొక్కళ్ళూ లేరు కదా!" అంటూ ఏడుస్తోంది.

"అమ్మా ఏడవకే బాబు, పెధవ అప్రదిష్ట కూడాను ఏమండీ వెంకటేశంగారు మేం వెడుతున్నా మండీ ఇంకోరోజెప్పుడైనా మాట్లాడుకొందాం"

ఇంక పెళ్ళివారు వెళ్ళిపోయాక ఉష సంగతడుగుతారా...ఉష ఒక్కటే ఏడుపంటే ఒక్కటేఏడుపు.



పావురాలకి మేత

ఫొటో. శ్రీ యస్. రాజా (భీమవరం)

## ★ వింత వివాహం ★

ఎవరు చెప్పినా వినదు రామం
ఎంతో చెప్పేడు "ఒసే ఆముసలా
విడ మాట్లకేవిటే. ఆవిడ అల్లాగే

అంటూంటుంది ఆవిడ కెలాగైన
బుద్ధిచెప్పాలి. నేనూ గోపాలం కలసి
ఏదైనా ఉపాయం ఆలోచిస్తాం.

భాస్కర్ చాలా మంచివాడు
తెలుసా? అతనికే నిన్నిచ్చి పెళ్ళి
చెయ్యాలే".




"ఇది సులభము...
లక్స్ టాయిలెట్ సబ్బుతో
ఇంకా మనోహరముగా
నుండవచ్చును"
అని
రుక్మిణిదేవి
చెప్పుచున్నది

"ఏమివచ్చినప్పటికి లక్స్ టాయిలెట్ సబ్బుతో నా చర్మమును నియమము తప్పకుండ సంరక్షించుటను మాత్రము మరవను లక్స్‌యొక్క చర్మ పోషకత్వపు పని నా చర్మమునకు అద్భుతమైన మార్పును తెచ్చును ఇంక క్రొత్త మెరుపును, రమ్యమైన నవీన మృదుత్వమును తెచ్చును," అని రుక్మిణిదేవి చెప్పుచున్నది




# లక్స్ టాయిలెట్ సబ్బు

సినీమా తారలకు
సౌందర్యమునిచ్చు సబ్బు

LTS 385-X·2 TJ

"అన్నయ్యా నువ్వూ రోక్కా బాబు ఏం చెయ్యబోకు"

"నీ కెందుకే అదంతాను. మేం చూసుకొంటాంగా"

గోపాలం, రామం కలిసి మంచి వుపాయం ఆలోచించారు ఆ వుపాయాన్ని వుషకి తెలియజేసేరు. ఉష వారి యుక్తికి చాలా సంతోషించింది ఉష కుటుంబం అంతా గోపాలం ఇంటి కెళ్ళేరు.

గోపాలం ఉష తలి తండ్రులని, రాముని గదిలో వుండమన్నాడు ఉషకి అచ్చంగా పూర్వకాలపు ముత్తయిదు లాగా ముస్తాబు చేసేరు

గోపాలం ఇంటికి మునుపటి పెళ్ళి వారినే పిలిపించారు యథాప్రకారం ముసలావిడ కూడా తయారయింది.

సరే పెళ్ళివారొచ్చారు.

గోపాలం చెప్పడం మొదలెట్టేడు. "ఈ అమ్మాయి మా పెదనాన్నగారి కూతురు. తల్లీ, తండ్రీ ఎవ్వరూ లేరు నేనే పెంచుతున్నాను. తరుడు ఫారం చదివి మానేసింది ఎక్కువ చదువేమీ చెప్పించలేదు లెండి"

"ఆ చాలు నాయనా...ఇట్టరు బిట్టరు చదవటంలేదు కదా - అమ్మా నీ పేరేవిటే తల్లీ?"

"సీతాలక్ష్మి అండి బామ్మగారు"

"అబ్బో, ఎంత బాగుందే పేరు నీకు పాటలొస్తే ఒక్కటి పాడవమ్మా"

"శ్రీసరస్వతి... నమోస్తుతే..." అని పాడింది.

"ఎంత ఆనందంగా వుందే తల్లీ! ... చక్కగా ఇలాంటి పాటలు పాడితే ఎంతో బాగుందమ్మా... బాగుంది ఎంచక్క మధ్యపాపిడి తీసింది వాలు జడేసింది మొన్నటి పిల్లలాగ పక్కపిన్నీసులు, గిక్క పిన్నీసులు, ఏవీ లేవు బాబు అచ్చంగా లక్ష్మి పార్వతిలాగ, ఆ పెద్ద బొట్టు, చేతినిండా గాజులు ... ఆవిసయం ... అంతా నచ్చిందే తల్లీ ... అమ్మయ్య నేటి కాలానికి మంచిపిల్ల దొరికింది. ఏవే కోడలా, మాట్లాడవేమే? కోపం గాబోలు. ఇంత మంచి సంబంధం వదులుకుంటే మరో సంబంధం దొరుకుతుందా ఒరే అబ్బాయి బెల్లంకొట్టిన రాయిలాగ నువ్వయినా మాట్లాడ వేంరా? నేనో ముసలి గొడ్డుని నామాట ఎవ్వరు వినిపించు కొంటారు?"

"బామ్మగారు, మాఅమ్మాయి పచ్చిపులుసు చాలా బాగా చేస్తుందండీ ఆ ఒక్క పులుసుతోనే మీకు కడుపునిండి పోతుందండీ గుండిగలతో అన్నం వండగలదు అన్ని పనులు చాతవ్వు"

"నాయనా, పిల్ల నాకు నచ్చింది ముమ్మాటికి నచ్చింది"

"అయితే తప్పకుండా మా అమ్మాయిని మీ మనవడికి చేసుకొంటారా?" అన్నాడు గోపాలం

"అయ్యో నా మాట కింక తిరుగుంటుందా? ముమ్మాటికి తిరుగుండదు అయితే నాకొడుకూ కోడలు ఏవీ మాట్లాడం లేదు. ఏం చెయ్యను?"

"బామ్మగారు, అదంతా మీ కెందుకు లెండి వాళ్ళని వొప్పించే బాధ్యత నాది మీరు సైఅంటే చాలు"

"ఇంకెన్ని సార్లు చెప్పను బాబు? పార్వతీ పరమేశ్వరుల సాక్షిగా చెపుతున్నాను ఈ సీతాలక్ష్మినే నామనవడికి చేసికొంటాను సరేనా?"

"బాగుందండి బామ్మగారు, ఒరే రామం మీరందరూ ఇలా రండి. నీ చెల్లెలికి పెళ్ళి నిశ్చయమయిందిరా.."

రామం, కుటుంబరావుగారు, అందరూ వచ్చారు అందరూ వీరిని చూచి తెల్లబోయారు.

"ఇదేవిటి, వీరందరూ ఇక్కడి కెందు కొచ్చారు?" అంది బామ్మగారు

"అబ్బే ఏం లేదండి బామ్మగారు ఈ సీతాలక్ష్మి మొన్న మీరు చూచిన ఉష వీరు ఉష తల్లి దండ్రులు. వుషకి ఇలా వేషం వేశాం అంతేనండి"

"కొంప ముంచేశారు మాట ఇచ్చేశాను కదా, ఇంక ఎలాగ? నేనిక్కడుంటే నా మర్యాదదక్కదు. ఒరే అబ్బాయి నేను ఇవ్వాళే ఏ కాశీకో రామేశ్వరానికో, వెళ్ళిపోతున్నాను మీరు హాయిగా వుండండి ఇదిగో వెళ్ళిపోతున్నా" అంటూ వెళ్ళిపోయింది.

ఉషకి, భాస్కర్ కి వైభవంగా వివాహం జరిగింది. ★